- 50శాతం మించి రిజర్వేషన్లను ఆమోదించలేమని వ్యాఖ్య
- ప్రభుత్వం తదుపరి కార్యాచరణపై ఉత్కంఠ



**న్యూఢిల్లీ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ఎస్ఎల్‌పీని సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. 50 శాతం రిజర్వే షన్లతోనే ఎన్నికలకు వెళ్లండని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదే శాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని ధర్మాసనం హైకోర్టుకు సూచించింది. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమ ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని.. మెరిట్స్ ప్రకారం విచారించాలని హైకోర్టుకు సూచించింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీఓ 9పై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఈ నెల 9న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్‌చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 13వ తేదీన పిటిషన్ దాఖలుచేసింది. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా 16, 17వ తేదీల్లో ఏదో ఒకరోజు ఈ అంశంపై విచారించాలని మంగళవారం సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ ముందు మెన్షన్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే రిజిస్ట్రీ ఈ కేసును గురువారం విచారణ జాబితాలో చేర్చింది. అయితే సుప్రీంకోర్టు దీనిపై విచారణకు నిరాకరించింది. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరవున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రిజర్వేషన్లు 50 శాతం మించొద్దనే అభిప్రాయం సరికాదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కులగణన సర్వే జరిగిందని, ప్రభుత్వం ఇంటింటి సర్వే చేసి లెక్క తేల్చిందని సర్వోన్నత న్యాయస్థానంకు వివరించారు. రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని, 3 నెలలు దాటినా బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకోలేదని అభిషేక్ సింఘ్వీ వాదించారు. రిజర్వేషన్లు 50 శాతం మించొద్దన్న తీర్పులు స్పష్టంగా ఉన్నాయని, కృష్ణమూర్తి జడ్జిమెంట్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పిందని ప్రతివాది లాయర్ వాదనలు బలంగా వినిపించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో విచారణకు స్వీకరించలేమని స్పష్టం చేసింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. సుప్రీంకోర్టు నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం తదుపరి తీసుకునే చర్యలపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. కేబినెట్ భేటీలో ఈ అంశంపై చర్చించే అవకాశాలు ఉన్నాయి.

# మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు

- ఛత్తీస్‌ఘడ్‌లో లొంగిన 170 మంది
- లొంగిన వారిలో వాసుదేవరావు తదితరులు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన హోం మంత్రి అమిత్ షా

**న్యూఢిల్లీ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** మావోయిస్టులకు వరుసగా భారీ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మావోయిస్టు పార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నేతగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ముందు లొంగిపోయిన మరుసటి రోజే మరో 170 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయా రు. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్ల డించారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. నిన్న ఛత్తీస్‌గఢ్‌లో 27మంది; మ హారాష్ట్రలో 61 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చారన్నారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో 258 మంది లొంగి పోయారన్న అమిత్‌షా.. నక్సలిజంపై పోరులో ఇదో పె ద్ద విజయమన్నారు. భారత రాజ్యాంగంపై తమ విశ్వా సాన్ని ప్రకటిస్తూ హింసను త్యజించాలనే వీరి నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల ఫలితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. తమ విధానం స్పష్టంగా ఉందన్న అమిత్ షా.. లొంగిపోయేవారిని స్వాగతిస్తామని.. ఇంకా తుపాకీతో ఉద్యమం కొన సాగించాలను కొనేవారు భద్రతా దళాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నక్సలిజం మార్గంలో ఇంకా కొనసాగుతున్న వారు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద స్థావరాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్ లోని అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్‌లు విముక్తిపొందిన ప్రాం తాలుగా ప్రకటించడం సంతోషదాయకమని తెలిపారు. ఇప్పుడు దక్షిణ బస్తర్‌లో నక్సలిజం జాడ ఉందని.. దీన్ని భద్రతా దళాలు త్వరలో తుడిచిపెడతాయని పేర్కొన్నారు.



ఛత్తీస్‌గఢ్‌లో భాజపా సర్కార్ ఏర్పాటిన తర్వాత జనవరి 2024 నుంచి 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1785మందిని అరెస్టు చేశారని తెలిపారు. 477 మందిని భద్రతాదళాలు నిర్మూలించాయని తెలిపారు. లొంగిపోయిన వారిలో సతీష్ అలియాస్ టి. వాసుదేవరావు సహా 10 మంది సీనియర్ మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం. లొంగిపోయిన వారి జాబితాలో రాణిత, భాస్కర్, నీలా అలియాస్ నందే, దీపక్ పాలో సహా పలువురు ఉన్నారు. వీరిలో వాసుదేవరావు తలపై రూ.కోటి రివార్డు ఉండగా.. మరికొందరిపై లక్షల్లో రివార్డులు ఉన్నట్లు తెలుస్తోంది.

# నా సమస్యలను కాంగ్రెస్ పెద్దలకు వివరించా

- పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు
- మంత్రి కొండా సురేఖ
- కాంగ్రెస్ నేతలు మహేశ్ గౌడ్, మీనాక్షితో సురేఖ భేటీ



**హైదరాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** తాజా పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చర్చించారు. గత కొన్ని రోజులుగా తనకు సంబంధించి చోటు చేసుకుంటున్న పరిణామాలను వివరించారు. నిన్న రాత్రి తన ఇంటి వద్దకు పోలీసులు వచ్చిన సమయంలో చోటు చేసుకున్న డ్రామాను వారికి వివరించారు. భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. నా సమస్య పరిష్కరించేం దుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. సెటిల్ చేస్తామని పార్టీ పెద్దలు చెప్పారు. మిగిలిన విషయాలు వారే చూసుకుంటారని భరోసాతో వెళ్తున్నా అని మంత్రి సురేఖ తెలిపారు. గత కొన్ని రోజులుగా తనను, తన కుటుంబాన్ని టార్గెట్ చేసుకుని ఇబ్బంది పెడుతున్నారని నేతల వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. డెక్కన్ సిమెంట్ యాజమాన్యం వ్యవహారంలో జరిగిన పరిణామాలు, వారితో జరిగిన చర్చలు, ఆ సంస్థ అక్రమాలు తదితర విషయాలన్నీ వివరించినట్లు తెలుస్తోంది. మీనాక్షి నటరాజన్‌ని తాను ఇవాళ కలిశానని చెప్పుకొచ్చారు మంత్రి సురేఖ. తాను చెప్పాల్సింది చెప్పానని తెలిపారు. జరుగుతున్న విషయాల గురించి కాంగ్రెస్ పెద్దలకు వివరించినట్లు చెప్పుకొచ్చారు. వాళ్లు ఏ నిర్ణయం తీసుకున్నా సరే పాటిస్తానని స్పష్టం చేశారు. తన ఆలోచనలు, ఇబ్బందులని కాంగ్రెస్ పెద్దలకు చెప్పానని వివరించారు మంత్రి కొండా సురేఖ. పార్టీ పెద్దలు కూర్చొని మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. జరిగిన విషయాలన్నింటినీ మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లానని.. భారం అంతా పార్టీ పెద్దలపైనే ఉంచానని స్పష్టం చేశారు. విచారణ చేసి త్వరలో నిర్ణయం చెబుతామని పార్టీ పెద్దలు చెప్పారని పేర్కొన్నారు. పెద్దలు ఏ నిర్ణయం తీసుకున్నా.. వారు ఇచ్చే ఆదేశాలను పాటిస్తానని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

# మీడియాకు ఎక్కి రచ్చ చేయవద్దు

## కొండాసురేఖకు మీనాక్షి,సున్నిత హెచ్చరిక

**హైదరాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** తెలంగాణ మంత్రి కొండా సురేఖతో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్‌లో మాట్లాడారు. మీడియా ముందుకు వెళ్లవద్దని కొండా సురేఖకు ఆమె సూచించారు. కూర్చొని మాట్లాడదామని మీనాక్షి నటరాజన్ చెప్పినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ఆ బాధ్యతల నుంచి ఇటీవల తప్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సిమెంటు కంపెనీల యాజమాన్యాలను ఆయన బెదిరించినట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో గట్టిగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్‌లో కొండా సురేఖ ఇంటికి పోలీసులు వెళ్లారు. సురేఖ నివాసంలో ఆమె మాజీ ఓఎస్డీ సుమంత్ ఉన్నారన్న సమాచారంతో మఫ్టీలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మంత్రి కుమార్తె సుస్మిత వారిని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలే ఇవన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. తన తల్లిదండ్రులనే లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖతో మీనాక్షి నటరాజన్ మాట్లాడినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని ఇంతటితో సమసిపోయేట్లు చూద్దామని ఆమె చెప్పినట్లు సమాచారం.





చెందిన మన్నె సత్యనారాయణ రెడ్డికి మొట్టమొదటిసారిగా గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్, పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీనివాస్ కలిసి అందజేశారు.

# గజం రూ. 3,10,000!




**హైదరాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భూముల వేలానికి మరోసారి సిద్ధమైంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం పరిధిలోని నాలెడ్జ్ సిటీలో 4,718.22 చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని వేలం వేయడానికి టీజీఐఐసీ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. గజానికి రూ. 3,10,000 రిజర్వ్ ధరను నిర్ణయించినట్లు టీజీఐఐసీ పేర్కొంది. ఈ భూమికి సంబంధిచిన ఈ–వేలం నవంబర్ 11న మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు టీజీఐఐసీ కార్యాలయంలో జరుగుతుందని తెలిపింది. ఇటీవల రాయదుర్గంలో టీజీఐఐసీ 18.67 ఎకరాలను వేలానికి పెట్టింది. తొలి విడతలో 7.67 ఎకరాలను వేలం వేయగా ఎకరం భూమి రూ. 177 కోట్లు పలికింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన భూముల వేలంలో ఇది అత్యధిక ధర. 7.67 ఎకరాల భూమిని రూ. 177 కోట్ల చొప్పున రూ. 1,356 కోట్లకు ఎంఎస్‌ఎం రియాల్టీ సంస్థ దక్కించుకుంది. ఈసారి గజానికి రూ. 3,10,000 అంటే ఎకరాకు రూ. 124 కోట్లుగా వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.




# జూబ్లీహిల్స్‌లో బోగస్ ఓట్లపై విచారణ

## ఇప్పుడు ఈసీకి ఆదేశాలు ఇవ్వలేమన్న హైకోర్టు

**హైదరాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓట్లపై మాజీ మంత్రి కేటీఆర్, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. పిటిషన్లపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే ఎలక్టోరల్స్‌ను ఈసీ రివిజన్ చేస్తోందని.. ఈ సమయంలో ఎలాంటి డైరెక్షన్ అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది హైకోర్టు. ఓటు చోరీపై హైకోర్టులో బీఆర్ఎస్ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా.. గురువారం విచారణ జరిగింది. బీఆర్ఎస్ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌తో సంబంధంలేని వారు ఓటరు జాబితాలో చేరారని తెలిపారు. బోగస్ ఓట్లపై ఎన్నికల సంఘానికి ఆధారాలు సమర్పించామని వాదనలు వినిపించారు. ఈసీ తరపు లాయర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రిప్రజెంటేషన్‌లపై ఎన్నికల అధికారిని ఆదేశించామని.. నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని వాదించారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్ట్ ధర్మాసనం బోగస్ ఓట్లపై ఈసీకి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేస్తూ విచారణను ముగించింది.

# మల్లోజుల బాటలో ఆశన్న

## సీఎం విష్ణుదేవ్ ఎదుట లొంగుబాటు



**రాయపూర్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన అగ్రనేత ఆశన్న ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ ఎదుట లొంగిపోయాడు. ఆయన ప్రస్తుతం మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్నాడు.ఇప్పటికే మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఛత్తీస్‌గడ్ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న ఆశన్న అలియాస్ తక్కళ్లపల్లి వాసుదేవరావు జనజీవన స్రవంతిలో కలిశారు. ఆయనతో పాటు 130 లొంగిపోయారు. ఆశన్నతో పాటు 130 మంది మావోయిస్టులను బీజాపూర్ పోలీసులు బస్సుల్లో తరలించారు. ఈ క్రమంలో లొంగిపోయిన నక్సలైట్లందరూ తమ వద్ద ఉన్న ఆయుధాలను అప్పగించి సరెండర్ అయ్యారు. వరుస పరిణామాల నేపథ్యంలో మావోయిస్టులు ఆయుధాలు వదిలి పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. అగ్ర నేతలు కూడా సుదీర్ఘ ఉద్యమ ప్రస్థానం ముగించి.. జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నారు.

# స్వీట్ షాపులపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

## దీపావళి కోసం నాసిరకం స్వీట్లు గుర్తింపు

**హైదరాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** దీపావళి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరంలో స్వీట్ షాపులపై జీహెచ్ఎంసీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని 43 స్వీట్ షాప్స్ లో 3 రోజుల పాటు అధికారులు ఫుడ్ సేఫ్టీ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గడువు ముగిసిన పదార్థాలు స్వీట్ల తయారీలో వాడుతున్నట్లు గుర్తించారు. స్వీట్ షాప్ లో అమ్మే వస్తువులకు ఎలాంటి లేబెల్, ఎక్స్ పైరీ డేట్ లేదని అధికారులు తెలిపారు. మిఠాయిలల్లో ప్రమాదకరమైన సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు నిర్ధారించారు. వంటశాలలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. దీపావళి గిరాకీ ఎక్కువగా వస్తుందని నాసిరకంగా టన్నుల కొద్దీ స్వీట్స్ తయారు చేస్తుండటంతో ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉందని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు హెచ్చరించారు. నిబంధనలు పాటించని స్వీట్ షాప్స్ కి నోటీసులు, భారీ పెనాల్టీలు విధించినట్లు తెలిపారు.

తహసిల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ నూతనంగా ఓటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరికి తపాలా శాఖ ద్వారా ఓటర్ గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో 100 సంవత్సరాల వయసు కలిగిన ఓటర్లను గుర్తించి వారి వయసును తగిన ఆధారాలతో సమర్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన



సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఓటరుగా నమోదైన వారికి తపాలా శాఖ ద్వారా ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటరు జాబితాలో 100 సంవత్సరాలు వయసు పైబడిన ఓటర్లను గుర్తించి వారి నిజ వయసు ఆధారంగా సవరించడానికి చర్యలు తీసుకుంటామని, జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో గల బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెండింగ్ లో గల ఫారం 6, 7, 8 దరఖాస్తులు పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షకులు శ్యాం లాల్, సంబంధిత

## ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్లకు అనుమతివ్వాలి



**గంభీరావుపేట:యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** గంభీరావుపేట మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడానికి ట్రాక్టర్లకు అనుమతి ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు గంట శ్రీనివాస్ కోరారు. గురువారం స్థానిక తహశీల్దార్ మారుతి రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ తదితరులు ఉన్నారు.

## కోతుల బెడద కోసం.. కొండెంగల ఫ్లెక్సీలు



**తాండూర్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** మండలంలోని సింగరేణి ప్రాంత మైన మాదారం టౌన్షిప్ లో కోతుల బెడద నియంత్రణ కోసం కొండెం గల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి ఆలోచనలతో కొండెంగాల ఫ్లెక్సీలను తయారు చేయించి కోతుల బెడద తగ్గించడం కోసం ఈ వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. తొలుతగా జనావాసాల రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం, టౌన్షిప్ లోని పార్కు ప్రదేశంతో పాటు భూలక్ష్మి కోదండ రామాల యం ప్రాంగణం, ప్రధాన కూడళ్ల వద్ద ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశా రు. ఒకవేళ ఫ్లెక్సీలను చూసి కో తుల బెడద తగ్గితే త్వరలోనే కార్మి క కాలనీలో ప్రతి ఇంటికి ఈ కొండెంగా ఫ్లెక్సీలను అంటించడం జరుగుతుందని తెలిపారు.

## రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదం

### నలుగురు సజీవ దహనం

**జయపుర, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** రాజస్థాన్‌లో బార్మర్ జిల్లాలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్కార్పియో కారు ఓ ట్రక్కు ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి.. కారులో ఉన్న నలుగురు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని స్థానికులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడమలానీ తహసీల్‌లోని డాబర్ గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు పని నిమిత్తం సింధారీకి వెళ్లారు. పని ముగించుకుని అర్ధరాత్రి దాటాక తమ స్కార్పియో వాహనంలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. వారి గమ్యస్థానానికి ఇంకా 30 కిలోమీటర్ల దూరంలో ఉండగా, సింధారీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సదా గ్రామ సమీపంలో మెగా హైవేపై ఎదురుగా వస్తున్న ఓ ట్రైలర్‌ను వారి కారు బలంగా ఢకొన్న వెంటనే కారులో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో మోహన్ సింగ్ (35), శంభు సింగ్ (20), పంచారామ్ (22), ప్రకాశ్ (28) అనే నలుగురు యు-వకులు తీవ్రమైన గాయాలతో కాలిపోయి మరణించారు. కారు నడుపుతున్న దిలీప్ సింగ్ ప్రాణాలతో బయటపడ్డాడు. అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## నిమిషప్రియ కేసులో స్టే కొనసాగుతోంది

### మరణశిక్ష అమలుపై సుప్రీంకు కేంద్రం వివరణ



**న్యూఢిల్లీ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారత నర్సు నిమిష ప్రియకు శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని గురువారం సుప్రీంకోర్టుకు కేంద్రప్రభుత్వం వెల్లడించింది. తీవ్రమైన పరిణామాలు ఏమీ జరగలేదని తెలిపింది. ఈ భారతీయ నర్సును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం దౌత్యమార్గాలను ఉపయోగించేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. తాజాగా ఆ మరణశిక్ష గురించి ప్రశ్నించింది. ఆమెకు చట్టపరమైన సహకారం అందిస్తోన్న 'సేవ్ నిమిషప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' తరఫు న్యాయవాది స్పందిస్తూ.. శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ వెంకటరమణి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ కేసులోకి కొత్త మధ్యవర్తి వచ్చారు. ఇప్పటివరకు మంచి విషయం ఏంటంటే.. తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకోకపోవడమేనని వెల్లడించారు. ఈ వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం కేసును జనవరికి వాయిదా వేసింది. అయితే ఏవైనా అత్యవసర పరిస్థితులు ఉంటే.. ముందస్తు లిస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. నిమిష ప్రియ నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక వ్యక్తి తలాల్ అదిబ్ మెహది భాగస్వామ్యంతో అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. తర్వాత ఆ వ్యక్తి ప్రియను వేధించి, పాస్‌పోర్ట్, ఇతర పత్రాలను లాక్కొన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. 2016లో అతడిపై ప్రియ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. కానీ, వారు ఆమెను పట్టించుకోలేదు. దీంతో 2017లో మెహదికి మత్తుమందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని భావించింది. కానీ, ఆ డోస్ ఎక్కువకావడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పారేసింది. చివరికి అక్కడినుంచి సౌదీకి వెళ్లిపోతుండగా.. సరిహద్దుల్లో ఆమెను అరెస్టు చేసి, మరణశిక్ష విధించారు. భారత ప్రభుత్వం, మత పెద్దల ప్రయత్నాలతో ప్రస్తుతానికి ఆ శిక్ష అమలు వాయిదాపడింది.

## ఆసియా కప్ హీరో తిలక్ వర్మకు సన్మానం

### సన్మానం చేసిన మన శంకర వరప్రసాద్ గారు



**హైదరాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** ఆసియా కప్ హీరో, యువ క్రికెటర్ తిలక్ వర్మ మెగా స్టార్ చిరంజీవి చేతుల మీదుగా సన్మానం అందు కున్నారు. ప్రస్తుతం హైద రాబాద్‌లో 'మనశంకర వరప్రసా ద్‌గారు' చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఈ సందర్భంగా సెట్ కు వచ్చిన తిలక్ వర్మను చిరు సత్కరించారు. ఇటీవల ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్తాన్‌పై టీమిండియా సాధించిన ఘన విజయంలో కీలక పాత్ర పోషించిన యువ క్రికెటర్ తిలక్ వర్మను అభినందించారు. హైదరాబాద్‌కు చెందిన యువ సంచలనం తిలక్ వర్మ టాలెంట్, అంకితభావం , పోరాట స్ఫూర్తిని మెగాస్టార్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో భాగంగా, మూవీ సెట్‌లో తిలక్ వర్మ కేక్ కట్ చేశారు. చిరంజీవి స్వయంగా అతనికి ఆసియా కప్ ఫైనల్ నాటి ప్రత్యేక ఫోటోను బహుమతిగా అందించారు. ఈ అరుదైన క్షణంలో చిరంజీవితో పాటు హీరోయిన్ నయనతార, దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి, కాస్ట్యూమ్ డిజైనర్ సుష్మిత కొణిదెల కూడా పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి, అభిమానుల నుండి ప్రశంసలు దక్కుతున్నాయి. దుబాయ్‌లో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో తిలక్ వర్మ అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఈ విజయం తర్వాత పలువురు క్రీడా ప్రముఖులు, రాజకీయ నాయకులు అతడిని ప్రశంసలతో ముంచెత్తారు. ఇప్పుడు మెగాస్టార్ నుండి అభినందన అందుకోవడంతో తిలక్ వర్మ సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి నటిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల విడుదలైన 'మీసాల పిల్ల' పాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని రికార్డులు సృష్టిస్తోంది. ఈ సినిమాతో మెగాస్టార్ బాక్సాఫీస్ వద్ద మరో పెద్ద హిట్ కొట్టడం ఖాయమని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## సురేఖ ఓఎస్డీ గురించి తెలియదు

### తన కుమార్తె ఏం మాట్లాడిందో కూడా తెలియదు

### కాంగ్రెస్ నేత కొండా మురళి

**హనుమకొండ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ విషయం తనకేమీ తెలియదని ఆమె భర్త, కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. తన కుమార్తె సుస్మిత హైదరాబాద్‌లో ఏం మాట్లాడిందో తెలియదన్నారు. స్మార్ట్ ఫోన్ చూడటం తనకు రాదని చెప్పారు. సిమెంట్ కంపెనీ యాజమాన్యాలను సుమంత్ బెదిరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను ఓఎస్డీ బాధ్యతల నుంచి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ ఇంటి వద్దకు సుమంత్ కోసం పోలీసులు రావడం.. మంత్రి కుమార్తె సుస్మిత అడ్డుకోవడం తదితర పరిణామాల నేపథ్యంలో హనుమకొండలో కొండా మురళి మీడియాతో మాట్లాడారు. నా కుమార్తె, అల్లుడు లండన్‌లో ఉన్నారు.. అక్కడ వ్యాపారం చేస్తున్నారు. నా బిడ్డకు పదవి ఏమీ లేదు.. ఆమె ఏ పార్టీలోనూ లేదు. మంత్రి ఛాంబర్‌కు ఇప్పటివరకు నేను వెళ్లలేదు. భద్రతా కారణాల వల్ల వేర్వేరు కార్లలో నేను, సురేఖ వెళ్తాం. సీఎం రేవంత్‌రెడ్డి నాకు ఎమ్మెల్సీ ఇస్తామన్నారు.. ఇస్తారు. ఆయన సీఎం కావాలని కోరుకున్న వారిలో నేనూ ఒకడిని. సీఎం, మంత్రి పొంగులేటి మా ఇంటికి వచ్చారు.. నన్నెందుకు టార్గెట్ చేస్తారని కొండా మురళి వ్యాఖ్యానించారు.





**శ్రీశైలం, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** కర్నూలు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించుకున్నారు. అర్చకులు, ఆలయ అధికారులు ఆయనకు వేదోక్తంగా స్వాగతం పలికారు. భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారికి మోదీ పూజలు చేశారు. మల్లికార్జునస్వామికి పంచామృతాలతో రుద్రాభిషేకం, భ్రమరాంబదేవికి ఖడ్గమాల, కుంకుమార్చన పూజలు చేశారు. పూజల అనంతరం శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడి శివాజీ దర్బార్ హాల్, ధ్యాన మందిరాలను తిలకించారు. ప్రధానితో పాటు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శ్రీశైలం చేరుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయం ప్రత్యేక విమానంలో కర్నూలు చేరుకున్న ప్రధాని.. అక్కడి నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి హెలికాప్టర్‌లో సున్నిపెంటకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రీశైలం వెళ్లారు. ఆలయానికి చేరుకున్న ప్రధానికి అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎంతో కలిసి ప్రధాని మోదీ శ్రీభ్రమరాంబ, మ్లకార్జున స్వామివార్లను దర్శించుకున్నారు. మల్లికార్జునస్వామికి పంచామృతాలతో రుద్రాభిషేకం చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం ప్రధానికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలంలో శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. రాజ దర్బార్ గోడలపై ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రను తెలిపే శిల్పాలను ఆసక్తిగా పరిశీలించారు. అక్కడి శివాజీ విగ్రహం వద్ద నమస్కరించారు. శివాజీ దర్బార్ హాల్, ధ్యాన మందిరాలను పరిశీలించారు. ధ్యానముద్రలో ఉన్న శివాజీ, అమ్మవారి విగ్రహాలను దర్శించు కున్నారు. అమ్మవారి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో పుష్పాలను సమర్పించారు. ప్రధానితో పాటు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శివాజీ స్ఫూర్తి కేంద్రానికి వెళ్లారు. ఈ కేంద్రం నిర్వహణ బాగుందని ట్రస్టు నిర్వాహకులను ప్రధాని మోదీ అభినంచారు. అక్కడి నుంచి భ్రమరాంబ గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సున్నిపెంట వద్ద సుమారు 1500 మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## ఏపీలో పర్యటించడం అదృష్టంగా భావిస్తున్న

**న్యూఢిల్లీ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** ఏపీలో పర్యటించడం ఎంతో ఆనందంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆశీర్వాదం పొందడం అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలను బలోపేతం చేసి.. పౌరులను శక్తిమంతం చేసేలా అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కనెక్టివిటీని పెంచే కార్యక్రమంలో పాల్గొనడం గర్వకారణమన్నారు. ఏపీ స్వాభిమాన సంస్కృతి భూమి.. విజ్ఞానశాస్త్రం.. ఆవిష్కరణల కేంద్రం కూడా. స్వచ్ఛశక్తి నుంచి సంపూర్ణ శక్తి ఉత్పత్తి వరకు భారత్ కొత్త రికార్డులు సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా మల్టీమోడల్ మౌలిక వసతులు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. గ్రామాల నుంచి నగరాలు, నగరాల నుంచి పోర్టుల వరకు కనెక్టివిటీపై దృష్టి పెట్టాం. భారత్, ఆంధ్రప్రదేశ్ వేగం, సామర్థ్యాన్ని ప్రపంచం చూస్తోందని మోదీ పేర్కొన్నారు.

## కల్తీ మద్యం కేసులో ప్రభుత్వం సీరియస్

**విజయవాడ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** నకిలీ మద్యంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ సాగుతోందని టీడీపీ నేత బుద్దా వెంకన్న అన్నారు. నకిలీ మద్యం కేసులో ఉన్నవారిని ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జోగి జోగి కస్తే బూడిద రాలినట్లు జగన్, జోగి రమేష్ కలిస్తే బూడిద రాలుతుందని తే పోయిందని వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లల్లో జగన్ అవినీతిని, హత్యలు చేసిన వారిని ప్రోత్సహించారని.. అదే చంద్రబాబు అయితే వెంటనే వారిపై చర్యలు తీసుకున్నారని అన్నారు. జోగి రమేష్ కీలక పాత్ర ఉందని జనార్ధన్ స్వయంగా ప్రకటించారని.. తప్పు చేసి దొరికిపోయి కూడా జోగి రమేష్ సిగ్గు లేకుండా వాగుతున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యంతో సంబంధం లేని చంద్రబాబు ఎందుకు ప్రమాణం చేయాలని ప్రశ్నించారు. 'జోగి రమేష్, జనార్ధన్ స్నేహితులం అని చెప్పలేదా. మీ ఇద్దరి మధ్య వాట్సప్ చాటింగ్, ఫేస్ టైమ్ కాల్స్ మాట్లాడింది వాస్తవం కాదా, నువ్వు ఏ తప్పు చేయకపోతే సిట్ ముందుకు వెళ్లు. నీ దగ్గర ఉన్న ఆధారాలు ఇచ్చి సచ్ఛీలత నిరూపించుకో' అంటూ సవాల్ విసిరారు. జగన్ అవినీతి గురించి లోకమంతా తెలుసన్నారు. ఆయన మద్యం కుంభకోణం వల్ల 12 మంది జైలుకు వెళ్లారని.. ఇప్పుడు నకిలీ మద్యం విషయంలో జోగి రమేష్ అడ్డంగా దొరికిపోయారని అన్నారు. ఇంత జరుగుతున్నా జగన్ నిద్ర పోతున్నాడా... జోగి రమేష్‌ను ఎందుకు సస్పెండ్ చేయలేదని నిలదీశారు. కొడాలి నానీ, పేర్ని నాని, దేవినేని అవినాష్, వెల్లంపల్లి, వల్లభనేని వంశీ వీరంతా గత ప్రభుత్వంలో నోటికొచ్చినట్లు వాగారని.. మహిళలని కూడా చూడకుండా దూషించారని బుద్దా వెంకన్న మండిపడ్డారు.

## సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ప్రారంభం మాత్రమే

మొదటి పేజీ తరువాయి



25 సంవత్సరాలుగా నరేంద్ర మోదీ.. సీఎంగా, పీఎంగా ప్రజా సేవలో ఉన్నారు. 21వ శతాబ్దం మోదీదే అవుతుందనడంలో సందేహం లేదు. సరైన సమయంలో దేశానికి సరైన నాయకుడిగా ప్రధాని ఉన్నారని ప్రశంసలు కురిపించారు. ఇలాంటి నాయకుడు ఉ ండటం దేశం అదృష్టంగా అభివర్ణించారు. చాలా మంది ప్రధానమంత్రులతో నేను కలిసి పనిచేశాను. కానీ, నరేంద్ర మోడీ లాంటి నాయకుడిని నేను చూడలేదని.. ఆయన విశ్రాంతి లేకుండా నిరంతరం పనిచేస్తూనే ఉన్నారని చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటుందని తెలిపారు చంద్రబాబు అన్నారు. మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి మన సైనిక బలాన్ని నిరూపించిం. మాటలతో కాదు.. చేతలతో చూపించే వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి ఏడాకి రూ.10 వేలు ఆదా అవుతుందని వెల్లడించారు. సరైన సమయంలో ప్రధాని మోడీ.. దేశానికి సరైన నాయకుడిగా ఉన్నారని ప్రశంసలు కురిపించిన ఆయన.. ఇలాంటి నాయకుడు ఉండటం దేశం అదృష్టంగా అభివర్ణించారు.. చాలా మంది ప్రధానమంత్రులతో కలిసి పనిచేశారు.. కానీ, నరేంద్ర మోడీ లాంటి నాయకుడిని నేను చూడలేదని.. ఆయన విశ్రాంతి లేకుండా నిరంతరం పనిచేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు చంద్రబాబు.. ఇక, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటుందని తెలిపారు ఏపీ సీఎం చంద్రబాబు.. నరేంద్ర మోడీ దృఢ సంకల్పంతో మనం 11వ స్థానం నుండి నాల్గో స్థానానికి ఎదిగామన్నారు.. మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ మన సైనిక బలాన్ని నిరూపించింది.. మాటలతో కాదు.. చేతలతో చూపించే వ్యక్తి ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు..

# ఫామ్‌హౌస్‌లో ముజ్రా పార్టీ

## పట్టుబడిన రాజకీయ ప్రముఖులు

## అదుపులో 33 మంది యువతి, యువకులు

## లింగంపల్లి సప్తగిరి ఫామ్‌హౌస్‌లో గుట్టుగా నిర్వహణ

## 2.45 లక్షల నగదు, మద్యం సీసాలు, 11 కార్లు స్వాధీనం

**హైదరాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** నగర శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న ముజ్రా పార్టీని పోలీసులు భగ్నం చేశారు. రంగారెడ్డి జిల్లా, మంచాల మండల పరిధిలోని లింగంపల్లి గ్రామ సమీపంలో గల సప్తగిరి ఫామ్‌హౌస్‌లో బుధవారం రాత్రి కిట్టీ పార్టీ పేరుతో అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఎస్ఐ నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ సందర్భంగా 33 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో 8 మంది యువతులు, 25 మంది యువకులు ఉన్నారు. వారి నుండి రూ.2.45 లక్షల నగదుతో పాటు 11 కార్లు, 25 సెల్‌ఫోన్లు, విలువైన మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఫామ్‌హౌస్ నిర్వాహకుడు రుద్రశెట్టి సప్తగిరి ఈ ముజ్రా పార్టీని నిర్వహిస్తున్నట్లు పోలీసులు తేల్చారు. ఈ మేరకు ముజ్రాపార్టీలో పాల్గొన్న యువతీ, యువకుల పేర్లను పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సిఐ మధు తెలిపారు. కాగా, ముజ్రా పార్టీ నిర్వహిస్తూ పట్టుబడిన వారిలో పలువురు రాజకీయ ప్రముఖులు ఉన్నట్లు సమాచారం. దీంతో నిందితులను మీడియా కంట పడకుండా పోలీసులు ఒక్కొక్కరిని పోలీస్ స్టేషన్ నుండి పంపించి వేశారు. మీడియా ప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వడానికి కూడా నిరాకరించారు. ముజ్రా పార్టీలో పట్టుబడిన వారి పట్ల పోలీసులు చూపిన ప్రేమ పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# జూబ్లీహిల్స్ ఎన్నికలో మద్దతు ఇవ్వండి

## సీపీఐ(ఎం)ను కోరిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్



**హైదరాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌కుమార్ యాదవ్‌కు మద్దతివ్వాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం జరుగుతున్న పోరాటంలో ప్రభుత్వంతో కలిసి రావాలని సీపీఐ(ఎం)ను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సీపీఎం కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో ఆయన భేటీ అయ్యారు. పార్టీ నగర కమిటీతో చర్చలు జరుగుతున్నాయని, ఈ నెల 20న జరిగే తమ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తామని జాన్‌వెస్లీ తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. దీనిపై మహేశ్‌కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.జ్యోతి, టి. సాగర్, మల్లు లక్ష్మి, అబ్బాస్, బండారు రవికుమార్, పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం రైతులను ఇబ్బంది పెట్టవద్దు

## ఐకెపి కేంద్ర సిబ్బందికి కడియం హెచ్చరిక



**జనగామ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే రైతులను.. కేంద్ర నిర్వాహకులు ఇబ్బంది పెడితే సహించేది లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో వారికి సహాయంగా ఉండి తగిన విధంగా చేయూత ఇవ్వాలన్నారు. నమిలిగొండలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కడియం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్య ఉన్నా రైతులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం- రైతు ప్రభుత్వమని దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల కోసం సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ ఏడాది నుంచి ధాన్యం డబ్బులతో పాటు బోనస్ కూడా అందించడానికి ప్రభుత్వం అద్భుతమైన నిర్ణయం తీసుకుందని కొనియాడారు. ధాన్యం కొనుగోలు ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రైతులకు మద్దతు ధరలు ఇవ్వడం, పూర్తి ధాన్యం కొనడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు.

# రోగులకు భరోసా కల్పించండి

**చేవెళ్ల, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** రోగులతో ఆప్యాయంగా మాట్లాడి వైద్యం చేయాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వైద్యులకు సూచించారు. చికిత్సకు వచ్చిన వారికి భరోసా కల్పించాలని అన్నారు. వారికి మనోధైర్యం ముఖ్యమని అన్నారు. గురువారం ఆయన తాండూరు జిల్లా ఆసుపత్రి, నర్సింగ్ విద్యార్థుల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులన్నీ తిరిగి రోగులతో మాట్లాడారు. వైద్యులు సమయపాలన పాటించాలని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఎదుర్కొంటున్న నీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ బాగాలేదని వైద్య సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యల పరిష్కారానికి పక్షం రోజుల్లోగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ పర్యవేక్షణలో వినయ్ కుమార్, ఆర్ఎంవో ఆనంద్ గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఆదిలాబాద్ డీపీఆర్వోగా విష్ణు

**ఆదిలాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** ఆదిలాబాద్ జిల్లా నూతన పౌర సంబంధాల శాఖ అధికారిగా (డీపీఆర్ఓ)గా విష్ణు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి మొక్కను అందజేశారు. ఇక్కడ డీపీఆర్ఓ పని చేసిన తిరుమల కామారెడ్డికి బదిలీ అయ్యారు. నిర్మల్ డీపీఆర్ఓగా పనిచేసిన విష్ణు బదిలీపై ఆదిలాబాద్ వచ్చారు. ఇంతకు ముందు విష్ణు కు ఆదిలాబాద్ డీపీఆర్ఓగా పని చేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా పలువురు జిల్లా పాత్రికేయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# గురుకులాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

## జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సమన్వయ అధికారి యాదగిరి

**ఆసిఫాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల గురుకులాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సమన్వయ అధికారి జూలూరు యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆసిఫాబాద్ (బాలురు), రెబ్బెన (బాలికలు), సిర్పూర్ టి (బాలికలు), కాగజ్ నగర్ (బాలికలు) లలో గల పాఠశాలలలో 6, 7, 8, 9 తరగతులలో మిగిలి ఉన్న ఖాళీలను బిఎల్‌వి సెట్ ఎంట్రన్స్ 2025 రాసి మెరిట్ జాబితాలో ఉన్న జిల్లాకు చెందిన విద్యార్థులతో భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. అడ్మిషన్ పొందగోరు అభ్యర్థులు బిఎల్‌వి సెట్ ఎంట్రన్స్ 2025 పరీక్ష రాసిన హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 21వ తేదీన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల లోగా జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ప్రతిభ ఆధారంగా ఉంటుందని, షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, బి ఎల్ వి సెట్ అభ్యర్థులు లేనియెడల మిగతా విద్యార్థులకు లాటరీ పద్ధతిన సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలలో 6వ తరగతిలో 12, 7వ తరగతిలో 13, 8వ తరగతిలో 19, 9వ తరగతిలో 25 సీట్ల ఖాళీలకు స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయని తెలిపారు.

# ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

**ఆసిఫాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లావ్యాప్తంగా అనుమతులు లేకుండా కొనసాగుతున్న సుమారు 550పై ఆర్ఎంపీ, పీఎంపీలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీ అనుమతులు లేకుండా దవాఖాన ఏర్పాటు చేసుకొని, అందులో పడకలు పెట్టి, రోగులకు ఐవీ క్యాన్లు పెట్టి హైడోస్ ఇంజక్షన్లు, గ్లూకోజ్ లు పెడుతున్నారని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ తదితరుల పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తం



**హత్నూర, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** ఆన్‌లైన్ మోసాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ హత్నూర పోలీస్ స్టేషన్ లో ఈనెల ఒకటో తేదీ నమోదైన కేసులో సాంకేతిక ఆధారాలతో మోసాలకు పాల్పడిన ప్రధాన నిందితుడు ఏ -2 గడ్డం ప్రకాష్ ను అదుపులో తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.ఏ -1 సంజయ్ తో కలిసి దక్ చార్ట్ క్లబ్ సోషల్ మీడియా ద్వారా ఒక వ్యక్తిని మోసం చేశారు.దీంతో వివిధ మార్గాల ద్వారా మొత్తం పది లక్షల 33 వేల రూపాయలు వసూలు చేసినట్టు నిందితులు ఒప్పుకున్నారు. దర్యాప్తులో భాగంగా నిందితుల నుండి 46000 నగదు,సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని నిందితుని ఏ -2 గడ్డం ప్రకాష్ రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ప్రజలు ఇలాంటి ఆన్లైన్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి అనుమానాలు ఉన్న సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్1930 నెంబర్ కు సంప్రదించాలని సూచించారు ఈ కేసు దర్యాప్తులో సమర్థవంతంగా వ్యవహరించిన జిన్నారం సీఐ ఎండి నయీముద్దీన్ తోపాటు స్థానిక ఎస్సై శ్రీధర్ రెడ్డికి, రైటర్ ప్రతాప్ లకు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించినట్లు తెలిపారు.

# గురుకులాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు



**మంచిర్యాల, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 :** జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు, గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ఆసక్తి ఉన్నగల వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా లక్షెట్టిపేట బాలికల గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు హాల్ టికెట్, ర్యాంకు ధ్రువీకరణ ప్రతులు జతపర్చాలని పేర్కొన్నారు. లక్షెట్టిపేట, చెన్నూర్, మందమర్రి, బెల్లంపల్లి బాలికలు, బెల్లంపల్లి, కాసిపేట, కోటపల్లి, మంచిర్యాల, జైపూర్ బాలుర సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్లను ఈనెల 18న లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. బాలికల గురుకులాల్లోని 6వ తరగతిలో ఎస్సీ 6, ఎస్టీ 2, బీసీ 3, జనరల్ 3 మైనారిటీ 2 సీట్లు ఉన్నాయని, 7వ తరగతిలో బీసీ 5, 8వ తరగతిలో ఎస్సీ 4, ఎస్టీ 1, బీసీ 10, జనరల్ 6, మైనారిటీ 5, 9వ తరగతిలో ఎస్సీ 3, ఎస్టీ 4, బీసీ 4, జనరల్ 5, మైనారిటీ 3 సీట్లు ఉన్నాయని వివరించారు. బాలుర గురుకులాల్లో 5వ తరగతిలో ఎస్టీ 3, జనరల్ 3, మైనారిటీ 2 సీట్లు, 6వ తరగతిలో ఎస్సీ 9, ఎస్టీ 5, జనరల్ 1, మైనారిటీ 6 సీట్లు, 7వ తరగతిలో ఎస్సీ 5, 8వ తరగతిలో ఎస్సీ 8, బీసీ 8, జనరల్ 6, మైనారిటీ 8, 9వ తరగతిలో ఎస్సీ 11, బీసీ 4, ఓసీ 7, మైనారిటీ 5 సీట్లు ఉన్నాయని తెలిపారు.

నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకోవడంపై ప్రధాని మోదీ వద్ద తాను ఆందోళన వ్యక్తం చేశానని ట్రంప్ చెప్పారు. మాస్కో నుంచి భారత్ చమురు కొనడం వల్ల ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగించేందుకు పుతిన్ ఆ నిధులు ఉపయోగిస్తున్నారని అమెరికా భావిస్తున్నదని తెలిపారు. ఈ కొనుగోళ్లపై తాను సంతోషంగా లేనని చెప్పాను. ఈ సందర్భంగా ఇక నుంచి రష్యా నుంచి చమురు కొనుగోలు చేయమని ప్రధాని మోదీ ఈరోజు తనకు హామీ ఇచ్చారని. ఇదొక కీలక ముందడుగు అని చెప్పారు. చైనా కూడా రష్యా ఆయిల్‌ను కొనకుండా చేస్తానని, ఇక అదే మిగిలి ఉందని తెలిపారు. భారత్, చైనా.. అమెరికాతో కలిసి వస్తే పుతిన్ చేస్తున్న యుద్ధానికి చెక్ పెట్టవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధన విధానంపై భారత్, అమెరికాల మధ్య ఘర్షణ ఉన్నప్పటికీ యూఎస్‌కు భారత్ సన్నిహిత భాగస్వామి అని ట్రంప్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ తనకు స్నేహితుడని, తమ మధ్య గొప్ప అనుబంధం ఉందని చెప్పుకొచ్చారు. నేను చాలా ఏండ్లుగా భారత్‌ను గమనిస్తున్నానని, అది అద్భుతమైన దేశమని చెప్పారు. గతంలో ప్రతి ఏడాది కొత్త నాయకుడు వచ్చేవారు. కొందరు కొన్ని నెలలకే మారిపోయేవారన్నారు. కానీ ఇప్పుడు తన మిత్రుడు చాలా కాలంగా అక్కడ అధికారంలో కొనసాగుతున్నారని వెల్లడించారు. మోదీ నాయకత్వంలో రాజకీయంగా స్థిరత్వం సాధించిందని వ్యాఖ్యానించారు.ఇదిలాఉండగా భారత్-పాకిస్థాన్ కాల్పుల విరమణకు సంబంధించి ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. యుద్ధం ఆపకపోతే 200శాతం టారిఫ్‌లు విధిస్తానని ఈ దేశాలను తాను హెచ్చరించానని అన్నారు. వాణిజ్యంతోనే తాను భారత్-పాక్ ఉద్రిక్తతలను తగ్గించానని తెలిపారు. ఓ డిన్నర్ ఈవెంట్‌లో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా భారత్‌కు కొత్తగా నియమితులైన అమెరికా రాయబారి సెర్గియో గోర్ గురించి ఆయన ప్రస్తావించారు. 'గోర్ గొప్పగా పనిచేస్తున్నారు. ఆయన భారత్‌లో అమెరికాకు మంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

# ట్రంప్‌కు లొంగిపోయిన ప్రధాని మోడీ

మొదటి పేజీ తరువాయి



న్యూఢిల్లీ, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలకు ప్రధాని మోడీ లొంగిపోయారని విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని, చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నా మోడీ నుంచి సమాధానం లేదన్నారు. ఈ బెదిరింపు చర్యల్లో భాగంగానే అమెరికా భారత్‌పై పెద్దఎత్తున సుంకాల్ని విధించిన సంగతి తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో భారత్ అమెరికాకు తలొగ్గి రష్యా నుంచి ఆయిల్‌ని కొనుగోలును నిలిపివేస్తున్నట్లు తనకు హామీ ఇచ్చిందని అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రంప్‌కి మోడీ భయపడిపోయారని రాహుల్ ఆరోపించారు. దీనికి తాజా సంఘటనలే తార్కాణమని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయదని ట్రంప్ నిర్ణయానికి మోడీ అనుమతించడం,. భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు ట్రంప్ చేస్తున్నప్పటికీ.. ప్రధాని మోడీ ట్రంప్‌కి పదేపదే అభినందనలు తెలుపుతూ సందేశాలు పంపడం ఏమిటన్నారు. ఆర్థికమంత్రి అమెరికా పర్యటనను రద్దు చేసుకోవడం, ఈజిప్టు షర్మ్ ఎల్ షేక్‌లో జరిగిన గాజా శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరుకాకపోవడం,ఆపరేషన్ సింధూర్ సమయంలో ట్రంప్ జోక్యం చేసుకుని యుద్ధాన్ని ఆపానని చెబుతున్నప్పటికీ మోడీ నోరెత్తకపోవడం..ఆ వ్యాఖ్యల్ని విభేదించకపోవడం వంటి చర్యల్ని చూస్తే.. మోడీ ట్రంప్‌కి భయపడిపోయారని తెలుస్తోందని రాహుల్ ఎక్స్ పోస్టులో ప్రధానిని విమర్శించారు.

# పాక్‌తో చెలిమి కోసం ట్రంప్ ఆరాటం

## భారత్‌లో సంబంధాలు దెబ్బతీసుకుంటున్నారు

## అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ వ్యాఖ్యలు

వాషింగ్టన్, అక్టోబర్16 : పాక్‌తో చెలిమి కోసమే ట్రంప్ ఆరాటం అని, అందుకు భారత్‌తో చెలిమిని వదులుకుంటున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశ మాజీ రాయబారి ఒకరు సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ సొమ్ము కోసం ట్రంప్ అహంభావంతో వ్యవహరిస్తున్నారన్నారు. అందుకోసం భారత్-అమెరికా సంబంధాలను కూడా చెడగొట్టారని ఆరోపించారు. జపాన్‌కు అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనాను ఎదుర్కోవడంలో అగ్రరాజ్యానికి భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి. ఆ విషయాన్ని గుర్తించకుండా అధ్యక్షుడు ట్రంప్ అహం చూపిస్తున్నారు. 40ఏళ్ల వ్యూహాత్మక ప్రణాళికను, దౌత్య సంబంధాలను ఆయన వదులు కుంటున్నారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ చేసింది తానేనంటూ ట్రంప్ చేసిన వాదనను భారత ప్రధాని మోదీ అంగీకరించడం లేదు. ఇక, పాక్ నుంచి ట్రంప్ కుమారుడికి భారీ మొత్తంలో డబ్బు అందుతోంది. ఈ కారణాల వల్లే భారత్-అమెరికా సంబంధాలను ట్రంప్ చెడగొడుతున్నారు. ట్రంప్ చేసిన ఈ భారీ తప్పిదాన్ని చైనా తమకు అనుకూలంగా మార్చుకుంటోందని ఇమాన్యుయేల్ ఆరోపించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్‌తో, అమెరికా వ్యాపారవేత్త జాక్ విట్కాఫ్ మధ్య బిజినెస్ డీల్ జరిగింది. విట్కాఫ్ కంపెనీలో ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్, అల్లుడు జేర్డ్ కుష్నర్ వాటాదారులుగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీన్ని ఉద్దేశిస్తూనే ఇమాన్యుయేల్.. ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఇమాన్యుయేల్ గతంలో ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేశారు.

# బందుకు వ్యాపార విద్య సంస్థలు సహకరించాలి

సూర్యాపేట, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి పార్లమెంట్లో చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ ఇచ్చిన తెలంగాణ బందుకు జిల్లా వ్యాప్తంగా వాణిజ్య వ్యాపార సంస్థలు విద్యా సంస్థలు, హోటళ్లు సహకరించాలని పలు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. బంద్ విజయవంతం చేయాలని కోరుతూ గురువారం స్థానిక మహావీర్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ జన సమితి నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. రాజకీయ విద్య, ఉద్యోగ అవకాశాలలో వెనుకబడిన తరగతుల వారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన బిల్లును పార్లమెంట్లో వెంటనే చట్టం చేయాలని వారు ముక్తకంఠంతో కోరారు.

పరిష్కరించాలి

- మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్



మంథని, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 : అభివృద్ధి పనులను పూర్తి చేయడం పై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. మంథని పాత పాల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉష ఇంటర్నేషనల్ లిమిటెడ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో మహిళ కుట్టు మిషన్ శిక్షణ మరియు ఉత్పత్తి కేంద్రం కుట్టు సెంటర్ ను కలెక్టర్ ప్రారంభించారు. మంథని పట్టణంలోని పురపాలక కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం, సంగీత కళాశాల, డే కేర్ సెంటర్ ను కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథని పట్టణంలో చేపట్టిన అంతర్గత సి.సి రోడ్లు, డ్రైయిన్లు, స్ట్రీట్ లైట్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. పాల కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన ఉష ఇంటర్నేషనల్ లిమిటెడ్ మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో మహిళ కుట్టు మిషన్ శిక్షణ కుట్టు మిషన్, శిక్షణ కేంద్రం ద్వారా ప్రసక్తి మహిళా సంఘాల్లోని ఆసక్తి గల మహిళలకు కుట్టు మిషన్ లో ఉచితంగా శిక్షణ అందించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఏకరూప దుస్తులు ఆర్డర్ ను ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. టైలరింగ్ లో మంచి ప్రావీణ్యం సంపాదిస్తే చాలా సంపాదించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. మంథని పట్టణ ప్రవేశ మార్గాల వద్ద ఆర్చ్ ఏర్పాటు చర్యలు తీసుకోవాలని అన్నారు. వయోవృద్ధులకు అనుకూలంగా ఉండే విధంగా డే కేర్ సెంటర్ ఏర్పాటు పనులను వారం రోజులలో పూర్తి చేయాలని, అక్కడ ఆధునిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు ఎన్.హెచ్. 163జి మంచిర్యాల వరంగల్ నాలుగు లైన్ల గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి సంబంధించి మన జిల్లాలో భూ ఐదలాయింపు చివరి దశకు చేరుకుందని కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణ పనులకు అక్కడక్కడ మిస్సింగ్ పరిహారం కోసం భూ సేకరణ బాధితులు పనులు అడ్డగిస్తున్నారని తెలుసుకున్నా కలెక్టర్ పెండింగ్ మిస్సింగ్ స్ట్రక్చర్ పరిహారం సమస్యను అక్టోబర్ 24 లోపు పరిష్కరించాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 30 లోపు మంథని, ముత్తారం, రామగిరి, మండలాల పరిధిలో జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన గ్రావెల్ పని పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత ఏజెన్సీలను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్.డి.ఓ.సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్,పి.డి. ఎన్.హెచ్ కీర్తి భరద్వాజ, మెగా ఏజెన్సీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంను సందర్శించి ఇటీవల విద్యాలయంలో విద్యార్థి చనిపోయిన సంఘటన గురించి విద్యార్థులతో మరణించిన విద్యార్థి తల్లిదండ్రులతో మధ్యాహ్నం 1:30 గంటల వరకు వేరువేరుగా ఇంటరాక్ట్ అవుతారు. అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల బాలురలోనే పత్రిక సమావేశం నిర్వహిస్తారు.

# పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## ఎమ్మెల్యే విజయ రమణారావు



పెద్దపల్లి, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 : పాడి రైతులు, పశువుల కాపర్లు పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. గురువారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామ మండల పశు సంక్షేమ విశేషాల గురించి అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రభుత్వం తరపున పశు సంక్షేమం, పాడి రైతులకు అమలు చేస్తున్న కృత్రిమ గర్భధారణ సేవలు, గొర్రెల కాపరులకు అందుతున్న టీకాలు, నట్టల నివారణ చర్యల గురించి వివరించారు. మెగా క్యాంప్ నందు పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేయడం, చూడి పరీక్షలు గర్భాశయ సమస్యలు, వాటి నివారణ, పశువుల ఆరోగ్య సమస్యలు, నివారణ, నట్టల నివారణ చేపట్టడం జరుగుతుందని అవసరమైన పశువుల కాపరులు, పాడి రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. నేడు నిట్టూరు గ్రామంలో 29 దూడలకు నట్టల మందు, 38 పాడి పశువులకు చూడి పరీక్షలు గర్భాశయ సమస్యలు, అన్ని పశువులకు గాలి కుంటు టీకాలు వేయడం జరిగిందని అన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె విజయ భాస్కర్, అసిస్టెంట్ సంచాలకులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వేణుగోపాల రావు, తెలంగాణ పశువు గణన అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సత్య ప్రసాద్ రెడ్డి, వెటర్నరీ సర్జన్ లు డాక్టర్ అఖిల్ రాజు ,డాక్టర్ అనిల్ కుమార్ ,డాక్టర్ సురేష్ ,డాక్టర్ రవి, వెటర్నరీ అసిస్టెంట్లు, పెద్దపల్లి మండల గోపాల మిత్రులు చంద్రయ్య, శ్రీనివాస్ రవీందర్, మనోహర్, లక్ష్మణ్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సోమాజిగూడ లో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సమావేశం



హైదరాబాద్, యదార్థవాది విలేఖరి, అక్టోబర్ 16 : గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని సోమాజిగూడలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సమావేశంలో పాల్గొన్న ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరావు ఇతర ముఖ్య నేతలు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ జెండా ఎగరాలి.. ప్రజా ప్రభుత్వంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృదిలో ముందు వరుసలో నిలిపేందుకు నవీన్ యాదవ్ ను గెలిపించాలని అన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో సంక్షేమ అభివృద్ధి ముందుకు తీసుకుపోతు న్నామని, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ అందిస్తున్నాం. ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళలకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేస్తున్నామని ఆయన అన్నారు. ప్రతి బూత్ ఇన్చార్జ్ ప్రతి ఇంటింటికీ వెళ్ళి ఓటరును ప్రత్యక్షంగా కలిసి ప్రభుత్వ పథకాలను వివరించాలని, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారు.. కాంగ్రెస్ ను గెలిపించారు. ఇప్పుడు జరుగుతున్న బై పోల్ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కూడా అభివృద్ధి కి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపిస్తారు..

# అత్యవసర సమయంలో సిపిఆర్ ఫలితాలనిస్తుంది



సూర్యాపేట, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 : సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ సిబ్బందికి సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండాలని ఉద్దేశంతో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు ప్రభుత్వ వైద్యులచే సిపిఆర్ పై శిక్షణ ఇవ్వడం జరిగినది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి ఏఆర్ డిఎస్పి నరసింహ చారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ప్రమాదాలు జరిగి ఎవరైనా క్షతగాత్రులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న లేదా ప్రాణాలు పోయే సందర్భం ఉన్నప్పుడు అత్యవసరమైన సిపిఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చు అని అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సిబ్బంది అందరికీ సిపిఆర్ పై విడతల వారిగా శిక్షణ ఇస్తామని జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. జిల్లా పోలీస్ సిబ్బంది అందరూ శిక్షణను సద్వినియోగం చేసుకొని మెలకువలు నేర్చుకోవాలని తద్వారా ప్రమాదాల సమయంలో గుండెపోటుల సమయంలో బాధితులను కాపాడాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమం నందు ఏఆర్ సిబ్బంది జిల్లా వైద్యాధికారి, జిల్లా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



హుస్నాబాద్, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 : హుస్నాబాద్ మండలంలోని జిల్లెల్ల గడ్డ గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జూనియర్ కళాశాల(బాలుర) ను గురువారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాలయం ప్రాంగణం మొత్తం కలియ తిరిగి పరిశీలించారు. విద్యాలయంలో 10 రోజుల క్రితం విద్యార్థి వివేక్ మృతి చెందడం పై విచారం వ్యక్తం చేసి వివరాల గూర్చి ఆరా తీశారు. పోలీస్ అధికారుల విచారణలో నిజాలు వెలుగులోకి వస్తాయని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. గురుకులం ప్రాంగణం బయట లోపల సిసి కెమెరా పని చెయ్యాలని రాత్రి సమయం విధులు నిర్వహించే అధ్యాపకులు పూర్తి శ్రద్ధ వహించాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఆరోజు జరిగిన సంఘటన గూర్చి ఆరా తీశారు. ఎలాంటి సంఘటన జరిగిన వెంటనే అధ్యాపకులకు తెలపాలని సూచించారు. మంచి క్రమ శిక్షణ అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రామ్మూర్తి, తహసిల్దార్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులు సత్వర పరిష్కారం



జగిత్యాల, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 : జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం తహసిల్దార్ కార్యాలయం ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్. గురువారం జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తు ను శూన్యంగా పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్ల ప్రజలకు అందించవలసిందిగా అధికారులకు ఆదేశించారు అనంతరం పలు రికార్డులను పరిశీలించిన జిల్లా కలెక్టర్. కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధు సూదన్, గొల్లపెల్లి మండల తహసిల్దార్ ఎండి మాజీద్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో అలసత్వం వద్దు



సిద్దిపేట, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 : ఖరీఫ్ 2025-26 సీజన్ వరిధాన్యం సులభంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ జరిగేలా అందరూ మిల్లర్లు మరియు అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా సివిల్ సప్లై, డీఆర్డిఓ అధికారులందరితో జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ సివిల్ సప్లై శాఖ అందించిన మార్గదర్శకాల ప్రకారం కొనుగోలు చేయాలని అధికారులను, మిల్లర్ ప్రతినిధులకు తెలిపారు. ఈ సీజన్ లో 6లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నాం. జిల్లాలో 439 వరి ధాన్యం సెంటర్ లలో ఇప్పటి వరకు 239 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం రాగానే గన్ని లలో నింపి లోడ్ చేసి మిల్లులకు పంపిస్తాం. మిల్లులో కూడా తేమ శాతం తనికీ చేయాలని సూచించారు. ఆయా కొనుగోలు కేంద్రాలను కేటాయించడం కోసం మిల్లర్ ప్రతినిధులు అగ్రిమెంట్ చేసుకుని బ్యాంక్ గారంటీ తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. వరి ధాన్యం దిగుమతి లో ఆలస్యం చెయ్యవద్దనీ దిగుమతి చేసుకోగానే ఆన్లైన్ లో ఎంట్రీ చెయ్యాలని తెలిపారు. ఫిజికల్ స్టాక్ మరియు రిజిస్టర్ ఎంట్రీ టాలీ కావాలని తెలిపారు. లేబర్ కొరత లేకుండా చూసుకోవాలి. ఎక్కడ కూడా ధాన్యం మళ్లించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా సివిల్ సప్లై అధికారులను తెలిపి పరిష్కరించుకోవాలి. ఓపిఎంఎస్ పోర్టల్ లో అప్లోడ్ చేసే విధానం తెలుసు కోవాలి. గతం లాగానే వరిధాన్యం కొనుగోలు లో విజయవంతం చేసిన విధంగానే ఈ ఖరీఫ్ లో కూడా కొనుగోలు ప్రక్రియ కొనసాగాలని తెలిపారు. ఈ సమావేశం డిసిఎస్ఓ తనూజ, డిఎం సిఎస్ ప్రవీణ్, డీఆర్డిఓ జయదేవ్ ఆర్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, డిటిఓ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్థివ రథాల సంఖ్యను పెంచాలి

సూర్యాపేట, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 : రోజురోజుకు దిన, దిన అభివృద్ధి చెందుతున్న సూర్యాపేట పట్టణంలో పార్థివ రథాలు మూడే ఉండటంవల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురైతున్నారని వాటి సంఖ్యను ఆరుకు పెంచాలని సిపిఎం పార్టీ వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్ అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని సీతారాంపురం లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీలో రెండు లక్షలకు పైగా ప్రజలు నివాసం ఉంటున్నారని రోజు అనేక మంది వివిధ కారణాల మూలంగా చనిపోతున్నారని వారికి అనుగుణంగా పార్థివ వాహనాలు లేకపోవడం పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సూర్యాపేట పట్టణంలో హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు మతాలవారీగా ఒక్కొక్కటి చొప్పున పార్థివ రథాలను పురపాలక సంఘం వారు కేటాయించారని అవి రెండు లక్షల పైగా ఉన్న సూర్యాపేట పట్టణ ప్రజలకు అసౌకర్యంగా ఉన్నాయని వాటి సంఖ్యను ఆరుకు పెంచాలని కోరారు. ఒకే మతం వారు ఇద్దరు ముగ్గురు ఒకేరోజు చనిపోయిన సందర్భంగా సమస్య తీవ్రంగా ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం ప్రజలకు సౌకర్యం మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు షేక్ జహంగీర్, టేకుల సుధాకర్ పాల్గొన్నారు.

# కపాస్ కిసాన్ పై పత్తి రైతులకు అవగాహన

## రైతులు డౌన్ లోడ్ చేసుకుని, వివరాలు నమోదు చేసుకోవాలి

## జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం

రాజన్న సిరిసిల్ల, యదార్థవాది విలేకరి, అక్టోబర్ 16 : జిల్లాలోని పత్తి రైతులకు కపాస్ కిసాన్ పై అవగాహన కల్పిస్తున్నామని గురువారం జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తెలిపారు. పత్తి సాగు చేసే రైతులకు సీసీఐ అందించే మద్దతు పొందేందుకు కపాస్ కిసాన్ యాప్ సిద్ధం చేసిందని వెల్లడించారు. ఈ అప్లికేషన్ లో రైతుల వివరాలు నమోదు చేసుకుంటేనే తమ పత్తి సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. పత్తి నాణ్యత ఆధారంగా క్వింటాలుకు రూ. 7689 నుంచి 8110 మద్దతు ధర ఉందని, రైతులు తమ సమీపంలోని ఆయా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించి మద్దతు పొందాలని పిలుపు నిచ్చారు. జిల్లాలోని ఆయా మండలాల్లో తమ శాఖ అధికారులు రైతులకు యాప్ డౌన్ లోడ్ చేసుకునే విధానం, వివరాల నమోదు, స్లాట్ బుకింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని డీఏఓ తెలిపారు. జిల్లాలోని పత్తి సాగు చేసే రైతులు తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. సీసీఐ మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు.



# రొయ్యలను తింటే అసలు ఎలాంటి లాభాలు కలుగుతాయి..?

## వీటిని ఎంత మోతాదులో తినాలి..?

నాన్ వెజ్ ప్రియులు వివిధ రకాల మాంసాహారాలను తింటుంటారు. వాటిల్లో రొయ్యలు కూడా ఒకటి. రొయ్యలు మనకు అనేక రకాలుగా లభిస్తాయి. పచ్చి రొయ్యలు చాలా టేస్టీగా ఉంటాయి. అద్భుతమైన ప్రయోజనాలను, పోషకాలను అందిస్తాయి. రొయ్యలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చాలా మంది ప్రజలు ఎంతో ఇష్టంగా తింటారు. రొయ్యలు మనకు అనేక లాభాలను అందిస్తాయి. రొయ్యల్లో హై క్వాలిటీ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ప్రోటీన్ల వల్ల కణజాలం మరమ్మత్తులకు గురవుతుంది. ఎంజైమ్‌లు, హార్మోన్లు సరిగ్గా ఉత్పత్తి అవుతాయి. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది. రొయ్యల్లో అనేక విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి.

**థైరాయిడ్ ఉన్నవారికి..**

రొయ్యల్లో విటమిన్ బి12 అధికంగా ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయం చేస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీని వల్ల నాడీ సంబంధ సమస్యలు తగ్గుతాయి. ముఖ్యంగా మెడ, భుజాల్లో వచ్చే నొప్పి తగ్గుతుంది. రొయ్యల్లో ఐరన్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. శరీరంలో ఆక్సిజన్ సరఫరా సక్రమంగా జరిగేలా చూస్తుంది. దీంతో నీరసం, అలసట తగ్గుతాయి. రొయ్యల్లో ఉండే జింక్ రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. దీని వల్ల గాయాలు, పుండ్లు త్వరగా మానుతాయి. కణాల నిర్మాణం జరుగుతుంది. రొయ్యల్లో ఉండే అయోడిన్ థైరాయిడ్ ఉన్నవారికి మేలు చేస్తుంది. థైరాయిడ్ సమస్య నుంచి బయట పడేలా చేస్తుంది. శరీర మెటబాలిజంను పెంచుతుంది. దీంతో జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడతాయి. థైరాయిడ్ గ్రంథి ఆరోగ్యంగా ఉంటుంది.

**ఎలా తినాలి..?**

రొయ్యల్లో సెలీనియం అధికంగా ఉంటుంది. ఇది మినరల్ అయినప్పటికీ శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా కూడా పనిచేస్తుంది. ఇది కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. దీంతో క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. రొయ్యల్లో కొలెస్ట్రాల్ ఉంటుంది. కానీ ఇది చాలా స్వల్ప మోతాదులో ఉంటుంది. అందువల్ల రొయ్యలను తింటే మన శరీరంలోని కొలెస్ట్రాల్‌పై ఎలాంటి ప్రభావం పడదు. అయితే రొయ్యలను ఉడకబెట్టి లేదా కూర రూపంలో తినాలి. వేపుడు రూపంలో తినకూడదు. అలా తింటే నష్టమే ఎక్కువ జరుగుతుంది. ఇక రొయ్యల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. కనుక శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. గుండె పనితీరు మెరుగు పడుతుంది. గుండె జబ్బులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.


**ఎంత మోతాదులో తినాలి..?**

రొయ్యల్లో ఆస్టాజాంతిన్ అనే ఓ ప్రత్యేకమైన యాంటీ ఆక్సిడెంట్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది కూరగాయల్లో లభించే బీటా కెరోటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కన్నా చాలా శక్తివంతమైంది. దీని వల్ల శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. గుండె కండరాలు, రక్త నాళాల వాపులు తగ్గుతాయి. దీంతో గుండె పోటు రాకుండా చూసుకోవచ్చు. రొయ్యల్లో క్యాలరీలు చాలా తక్కువగా, ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. కనుక వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఇక రొయ్యలను 100 గ్రాముల మోతాదులో తింటే మనకు దాదాపుగా 100 క్యాలరీల శక్తి లభిస్తుంది. ప్రోటీన్లు 24 గ్రాములు, కొవ్వులు 2 గ్రాములు, కొలెస్ట్రాల్ 200 మిల్లీగ్రాములు లభిస్తాయి. విటమిన్ బి12తోపాటు సెలీనియం, అయోడిన్, ఫాస్ఫరస్ వంటి పోషకాలను పొందవచ్చు. ఇక రొయ్యలు ఆరోగ్యకరమే అయినప్పటికీ వీటిని మోతాదులోనే తినాల్సి ఉంటుంది. వారానికి సుమారుగా 150 గ్రాముల వరకు రొయ్యలను తినవచ్చు. ఇలా పలు జాగ్రత్తలను పాటిస్తూ వీటిని తింటే అనేక లాభాలను పొందవచ్చు.

# దగ్గు, జలుబుతో అవస్థ పడుతున్నారా..?

## అయితే ఈ సహజసిద్ధమైన ఇంటి చిట్కాలను పాటించండి..!

దగ్గు, జలుబు అనేవి సీజన్లు మారినప్పుడల్లా మనకు వస్తూనే ఉంటాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి సీజన్లు మారకున్నా తరచూ ఈ సమస్యలు ఇబ్బందులకు గురి చేస్తుంటారు. వాతావరణంలో వచ్చే మార్పులతోపాటు కాలుష్యం, పలు ఇతర కారణాల వల్ల కూడా దగ్గు, జలుబు సమస్యలు మనల్ని అవస్థలకు గురి చేస్తుంటాయి. అయితే ఈ సమస్యలకు చాలా మంది ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడుతుంటారు. కానీ ఇంగ్లిష్ మెడిసిన్‌ను తరచూ వాడడం వల్ల దీర్ఘకాలంలో అనేక సమస్యలు వస్తాయి. అనేక సైడ్ ఎఫెక్ట్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీంతో పలు వ్యాధులు సైతం వచ్చేందుకు అవకాశాలు ఉంటాయి. కనుక ఇంగ్లిష్ మెడిసిన్‌ను ఎక్కువగా వాడకూడదు. మరి ఆయా సమస్యల నుంచి ఎలా బయట పడాలి అని చాలా మందికి సందేహం వస్తుంటుంది. కానీ అందుకు ఆయుర్వేదంలో చక్కని పరిష్కారాలు ఉన్నాయి. పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల ఆయా సమస్యల నుంచి సులభంగా బయట పడవచ్చు. పైగా వాటి వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవు. ఇక ఆ ఇంటి చిట్కాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.



**హెర్బల్ టీలు..**

దగ్గు, జలుబు వంటి సమస్యలు ఉన్నప్పుడు రోజూ 2 లేదా 3 సార్లు హెర్బల్ టీలను సేవిస్తుండాలి. అల్లం, తులసి, కమోమిల్, పెప్పర్‌మింట్ వంటి హెర్బల్ టీలు ఆయా సమస్యల నుంచి త్వరగా బయట పడేలా చేస్తాయి. వీటిల్లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఇన్ ఫెక్షన్లను త్వరగా తగ్గిస్తాయి. దీంతో దగ్గు, జలుబుతోపాటు ముక్కు దిబ్బడ నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. వేడి వేడి చికెన్ లేదా వెజిటబుల్ సూప్‌ను తాగుతున్నా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. దీని వల్ల కఫం త్వరగా కరిగిపోతుంది. దగ్గు, జలుబు తగ్గుతాయి. ఇక ఈ సమస్యలను తగ్గించడంలో తేనె కూడా అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. ఒక టీస్పూన్ తేనెను ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలిపి రోజుకు 2 సార్లు లేదా 3 సార్లు తాగుతుంటే ఫలితం ఉంటుంది. అవసరం అయితే అందులో నిమ్మరసం కూడా కలుపుకోవచ్చు.

**అల్లం, వెల్లుల్లి..**

అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు సమస్యలను తగ్గిస్తాయి. వికారం నుంచి బయట పడేలా చేస్తాయి. వైరస్ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. అల్లంను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను వడకట్టి అందులో కాస్త తేనె, నిమ్మరసం కలిపి తాగాలి. లేదా నేరుగా ఒక టీస్పూన్ అల్లం రసాన్ని కూడా తాగవచ్చు. ఇలా రోజుకు 2 లేదా 3 సార్లు చేస్తుంటే ఫలితం ఉంటుంది. ఇక వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. ఇందుకు గాను 2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను తీసుకుని కాస్త నలిపి అందులో కాస్త తేనె కలిపి నేరుగా అలాగే తినేయాలి. లేదా వెల్లుల్లి రసాన్ని కూడా తాగవచ్చు. ఇలా రోజుకు 2 సార్లు చేస్తుంటే ఉపయోగం ఉంటుంది.

**పసుపు, మిరియాలు..**

పసుపు, మిరియాల పొడి, దాల్చిన చెక్క పొడిలలో దేన్నయినా సరే పాలలో కలిపి తీసుకుంటే ఉపయోగం ఉంటుంది. వీటిల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. దగ్గు, జలుబు నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. నారింజ, నిమ్మ వంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. దీని వల్ల దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే ఈ పండ్లను తేనెతో కలిపి తింటే ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుంది. ఇలా ఆయా ఇంటి చిట్కాలను పాటిస్తే దగ్గు, జలుబు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. పైగా ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి.

# పెరుగులో బెల్లం కలిపి తింటే ఇన్ని లాభాలు ఉన్నాయా..?

## తెలిస్తే వెంటనే తినడం ప్రారంభిస్తారు..!



పెరుగును మనం రోజువారి ఆహారంలో భాగంగా తింటూనే ఉంటాం. భోజనం చివర్లో పెరుగును తినకపోతే చాలా మందికి భోజనం చేసిన సంతృప్తి ఉండదు. అలాగే బెల్లాన్ని కూడా మనం వాడుతూనే ఉంటాం. దీన్ని తీపి పదార్థాల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే పెరుగులో బెల్లం కలిపి తింటే అనేక లాభాలు ఉంటాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ఈ మిశ్రమం అత్యంత ఎక్కువ పోషక విలువలను కలిగి ఉంటుందని అంటున్నారు. కనుక దీన్ని తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని సూచిస్తున్నారు. పెరుగులో బెల్లం కలిపి తింటే ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. మలబద్దకం ఉన్నవారు రోజూ ఈ మిశ్రమాన్ని తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

**జీర్ణ సమస్యలకు..**

పెరుగులో బెల్లం కలిపి తినడం వల్ల అనేక జీర్ణ సమస్యలను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా పొట్టలో ఉండే అసౌకర్యం తొలగిపోతుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. కడుపు ఉబ్బరం తగ్గుతుంది. బెల్లంలో ఉండే సహజసిద్ధమైన చక్కెరలు మన శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. దీని వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం, అలసట ఉండవు. ఉత్సాహంగా పనిచేస్తారు. యాక్టివ్‌గా ఉంటారు. చురుకుదనం వస్తుంది. బద్దకం పోతుంది. పెరుగులో ఉండే ప్రోటీన్లు, కొవ్వులు షుగర్ లెవల్స్‌ను నియంత్రిస్తాయి. దీని వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. కనుక డయాబెటిస్ ఉన్నవారు కూడా ఈ మిశ్రమాన్ని తినవచ్చు.

**ఎముకల ఆరోగ్యానికి..**

ఈ మిశ్రమంలో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. ఈ మిశ్రమంలో ఉండే మెగ్నిషియం, పొటాషియం, ఫాస్ఫరస్ వంటి పోషకాలు ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ మిశ్రమాన్ని తినడం వల్ల క్యాల్షియం కూడా అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. అనేక రకాల బి విటమిన్లు సైతం ఈ మిశ్రమం ద్వారా మనకు లభిస్తాయి. పెరుగు శరీరానికి చల్లదనం అందిస్తుంది. కనుక ఈ మిశ్రమాన్ని తింటే శరీరంలో ఉండే వేడి పోతుంది. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. కొందరికి సీజన్లతో సంబంధం లేకుండా శరీరంలో వేడి ఎల్లప్పుడూ ఉంటుంది. అలాంటి వారు ఈ మిశ్రమాన్ని తింటుంటే ఫలితం ఉంటుంది.

**లివర్ ఆరోగ్యానికి..**

పెరుగులో బెల్లం కలిపి తినడం వల్ల లివర్, రక్తం శుద్ధి అవుతాయి. ఆయా భాగాల్లో ఉండే వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. దీంతో శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. ఈ మిశ్రమం వల్ల జీర్ణ వ్యవస్థ సైతం శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటుంది. పెరుగులో బెల్లం కలిపి తింటే శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలను తగ్గిస్తుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇక ఈ మిశ్రమం ఆరోగ్యకరమే అయినప్పటికీ కొన్ని రకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారు మాత్రం దీన్ని తినకూడదు. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారు, విరేచనాలు అవుతున్నవారు, అలర్జీలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తినకపోవడమే మంచిది. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ పెరుగు, బెల్లం మిశ్రమాన్ని తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# ఉల్లిపాయలను నేరుగా తినడం ఇష్టం లేదా..?

## అయితే వాటితో టీ ఇలా తయారు చేసి తాగండి.. ఎన్నో లాభాలు కలుగుతాయి..!

ఉల్లిపాయలను మనం రోజువారి ఆహారంలో భాగంగా తింటూనే ఉంటాం. ఉల్లిపాయలను మనం రోజూ కూరల్లో లేదా వివిధ రకాల వంటల్లో వేస్తుంటాం. దీని వల్ల వంటలకు చక్కని రుచి వస్తుంది. ఉల్లిపాయలను కొందరు రోజూ పచ్చిగానే తింటుంటారు. అయితే ఉల్లిపాయలు ఘాటుగా ఉంటాయి కనుక కొందరు పచ్చిగా తినేందుకు ఇష్టపడరు. పైగా ఉల్లిపాయలను తింటే నోరు వాసన వస్తుంది. కనుక ఉల్లిపాయలను తినేందుకు కొందరు ఇష్టపడరు. అయితే ఉల్లిపాయలతో టీ తయారు చేసి తాగవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. ఉల్లిపాయలను పచ్చిగా తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయో, దీంతో టీ తయారు చేసి తాగినా కూడా అలాంటి లాభాలే కలుగుతాయి. పైగా ఘాటుదనం కాస్త తగ్గుతుంది. నోరు కూడా వాసన రాదు. కనుక ఉల్లిపాయల టీని ఎవరైనా సరే తాగవచ్చు. దీంతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.



**సీజనల్ వ్యాధులకు చెక్..**

ఉల్లిపాయల టీని పలు సంప్రదాయ వైద్య విధానాల్లో ఔషధంగా కూడా ఉపయోగిస్తారు. ఇది గొంతు సమస్యలను తగ్గిస్తుంది. దగ్గు నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. ఉల్లిపాయల్లో క్వర్సెటిన్, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి కనుక ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉంటాయి. ఇవి ఇన్ ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాయి. దీంతో సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉల్లిపాయల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. దీని వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. దీంతో రోగాల నుంచి త్వరగా బయట పడవచ్చు.

**జీర్ణ వ్యవస్థకు..**

ఉల్లిపాయల్లో ఉండే క్వర్సెటిన్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది కనుక శరీరంలోని తీవ్రమైన వాపులు సైతం తగ్గిపోతాయి. ముఖ్యంగా కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉల్లిపాయల టీ సహజసిద్ధమైన ఎక్స్ పెక్టొరెంట్ గా పనిచేస్తుంది. ఇది గొంతు, ఊపిరితిత్తులలో ఉండే కఫాన్ని తొలగిస్తుంది. దీని వల్ల ఛాతి పట్టేయడం, ముక్కు దిబ్బడ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. బ్రాంకైటిస్ తగ్గుతుంది. ఉల్లిపాయల టీ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అజీర్తిని తగ్గిస్తుంది. ఈ టీ ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణ సమస్యలు రాకుండా చేస్తుంది.

**ఎలా తయారు చేయాలి..?**

బీపీ ఉన్నవారికి ఉల్లిపాయల టీ ఎంతో మేలు చేస్తుంది. ఉల్లిపాయల్లో ఉండే క్వర్సెటిన్, సల్ఫర్ సమ్మేళనాలు రక్త నాళాలను ప్రశాంతంగా మారుస్తాయి. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఇక ఉల్లిపాయల టీని ఎలా తయారు చేయాలో చూద్దాం. ఇందుకు గాను 1 మీడియం సైజ్ ఉల్లిపాయ, 2 నుంచి 3 కప్పుల నీళ్లు, కొన్ని అల్లం ముక్కలు, 2 టీస్పూన్ల తేనె, కొద్దిగా నిమ్మరసం తీసుకోవాలి. ఉల్లిపాయను చిన్న ముక్కలుగా కట్ చేయాలి. పాత్రలో నీటిని పోసి అందులో ఉల్లిపాయ, అల్లం ముక్కలు వేసి నీటిని బాగా మరిగించాలి. స్టవ్‌ను సిమ్‌లో పెట్టి నీళ్లను 10 నుంచి 15 నిమిషాల పాటు మరిగించిన తరువాత ఆ నీళ్లను వడకట్టి అందులో తేనె, నిమ్మరసం కలపాలి. దీంతో ఉల్లిపాయల టీ రెడీ అవుతుంది. దీన్ని గోరు వెచ్చగా ఉన్నప్పుడు తాగేయాలి. ఈ టీని రోజూ ఒక కప్పు మోతాదులో తాగుతున్నా చాలు, అనేక లాభాలు కలుగుతాయి.

EDITOR, PRINTED, PUBLISHED AND OWNER, **BINGI SATHAIAH** YAADHARTHAVAADHI TELUGU DAILY, PRINTED AT MEGHA PRINTERS, H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, YAADHARTHAVAADHI@GMAIL.COM
TELTEL/02022, RNI/2023/85376 # 11-52, INDIRA NAGAR PRASHANTH NAGAR, SIDDIPET-502103, PUBLISHED FROM: H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, TELANGANA STATE. CELL:8500765666, 9491330519